ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
వరంగల్
ఉమ్మడి జిల్లా
శుక్రవారం 15 నవంబరు 2024





హనుమకొండలో దీపాలు, ఉసిరి కొనుగోలు చేస్తున్న మహిళలు

# కార్తీక శోభితం..

## నిండుపౌర్ణమి వేళ అభిషేకాలు, దీపోత్సవాలు

- నేటి వేడుకలకు ముస్తాబైన శైవ క్షేత్రాలు, ఆలయాలు
- వేయిస్తంభాల గుడిలో లక్షదీపార్చన
- హాజరుకానున్న మంత్రి కొండా సురేఖ


ఉత్సవాలకు సిద్ధమైన కొడవటూరు సిద్దులగుట్ట

హనుమకొండ కల్చరల్/ వరంగల్ కల్చరల్/ జనగామ కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : శివకేశవులకు ప్రీతికరమైన.. పవిత్ర కార్తీక మాసంలో కృత్తికా నక్షత్రంలో నిండు పౌర్ణమి వేళ వచ్చే కార్తీక పౌర్ణమి పర్వదినం కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న శైవక్షేత్రాలు, ఆలయాలు ముస్తాబయ్యాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచే ప్రత్యేక అభిషేకాలు, పూజలు, దీపోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రతీ ఇంటా భక్తులు ఉసిరిక స్నానాలు చేయడం, బ్రహ్మీ ముహూర్తంలో తెల్లవారుజామునే అభ్యంగన స్నానాలు చేసి కార్తీక వొత్తులు వెలిగించుకోవడం సంప్రదాయంగా వస్తోంది. ఇంటింటా లక్ష్మీదేవిగా కొలుస్తూ తులసీ మాతకు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేయడం ఈ పర్వం ప్రత్యేకత. దీపావళి నుంచి ప్రారంభమయ్యే కార్తీక మాస పూజలు పౌర్ణమి రోజున మరింత విశిష్టంగా జరుగుతాయి. దీనికి తోడు కార్తీక పౌర్ణమి రోజున శ్రీ రమా సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించడం కూడా అనాదిగా వస్తోంది. కార్తీక పూజల్లో ముఖ్యమైన ఉసిరి కొమ్మలు, కాయలతో పాటు పూలు, వివిధ రకాల పండ్ల అమ్మకాలతో నగరంలో సందడి కనిపించింది. హనుమకొండ, వరంగల్ చౌరస్తాలతో పాటు అనేక ప్రధాన కూడళ్లలో రద్దీ కనిపించింది. అలాగే జనగామ, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లా కేంద్రాలతో పాటు పలు పట్టణాలు, మండల కేంద్రాల్లోని పలు ఆలయాలను, ప్రసిద్ధ శైవ క్షేత్రాలను ముస్తాబు చేశారు. తెల్లవారుజామునుంచే భక్తులు స్వామివార్లను దర్శించుకునేలా, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసేలా ఏర్పాట్లు చేశారు.

### వేయిస్తంభాల ఆలయంలో ఇలా..

వేయిస్తంభాల ఆలయంలో ప్రత్యేకంగా లక్ష దీపోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ తెలిపారు. దేవాదాయ శాఖ సహకారంతో ఉదయం 5గంట నుంచి స్వామివారికి రుద్రాభిషేకాలు, సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు జరిగే లక్షదీపోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ సహా పలువురు

మిగతా 6వ పేజీలో...

## కాళేశ్వరంలో ప్రత్యేక పూజలు

మహదేవపూర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం పర్వదినం సందర్భంగా గురువారం వైకుంఠ చతుర్దశి పూజలు జరిగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున తరలి ముందుగా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. గోదావరిమాతకు చీర, సారె, కుంకుమ, పసుపులతో ప్రత్యేక పూజలు చేశా రు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మహన్యాసాక పూర్వాభిషేకం, రుద్రాభిషేకం, శుభానందదేవి ఆలయంలో అమ్మవారికి కుంకమ పూజలు నిరవహించారు. సరస్వతిదేవి ఆలయంలో పలు ప్రత్యేక పూజలు చేశారు. ఉసిరిక చెట్టు వద్ద లక్ష ముగ్గు లు వేసి లక్ష వత్తులతో దీపాలను ముట్టించి బ్రాహ్మణోత్తములను దీపా దానం అందజేశారు. శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా తెల్లవారుజామునుంచే ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక పూజలు, దీపోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.


కాళేశ్వరం ముక్తీశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు




లొంగిపోయిన మావోయిస్టుకు చెక్కును అందజేస్తున్న సీపీ

## మహిళా మావోయిస్టు లొంగుబాటు

- అనారోగ్యంతో లొంగిపోయిన మంజుల అలియాస్ నిర్మల
- రూ.20 లక్షల రివార్డు చెక్కు అందజేసిన సీపీ

హనుమకొండ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో సీపీఐ మావోయిస్టు పార్టీ స్పెషల్ జోనల్ కమిటీ మహిళా సభ్యురాలు కొడి మంజుల అలియాస్ నిర్మల గురువారం సీపీ అంబర్ కిషోర్ ఝా ఎదుట లొంగిపోయారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన విలేక రుల సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేటకు చెందిన మంజుల తండ్రి పీపుల్స్‌వార్‌కు సానుభూతిపరుడిగా పనిచేయడంతో పాటు ఆమె అన్న కుమారస్వామి అలియాస్ ఆనంద్, దగ్గరి బంధువు కోడి వెంకన్న అలియాస్ గోపన్న నర్సంపేట దళ కమాండర్‌గా పని చేసి ఎదురు కాల్పుల్లో మరణించారు. వారి ప్రభావంతో పాటు పీపుల్స్‌వార్ సిద్ధాంతాలకు ప్రభావితమైన మంజుల.. టెన్త్ మధ్యలో చదువు ఆపేసి 1994లో పీపుల్స్‌వార్ గ్రూపు నర్సంపేట దళంలో చేరింది. ఆ తర్వాత చేర్యాల దళంలో పని చేసింది. 1999లో నర్సంపేట దళకమాండర్ పెరం బుచ్చయ్యను వివాహం చేసుకుంది. 2000లో బుచ్చయ్య పోలీసుల ఎదుట లొంగిపోయాడు. అనంతరం 2001లో మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ సారథ్యంలో ప్రెస్ టీం ప్రొటెక్షన్ ప్లాటూన్‌లో యేడాది పనిచేసి 2002లో మహదేవపూర్ డిప్యూటీ దళ కమాండర్‌గా పనిచేస్తున్న క్రమంలో డివిజనల్ కమిటీ మెంబర్ కుకటి వెంకట్ అలియాస్ రమేశ్‌ను వివాహం చేసుకుంది. వైద్యం కోసం మరో మహిళా దళ సభ్యురాలితో భూపాలపల్లికి వచ్చి 2002 డిసెంబర్ 24 పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లింది. 2004లో జైలు నుంచి విడుదలై తిరిగి మావోయిస్టులతో సంబంధాలు కొనసాగిస్తూ మహదేవపూర్ దళసభ్యురాలిగా బాధ్యతలు చేపట్టింది. 2005లో మాహదేవపూర్, చేర్యాల, మహరాష్ట్ర, సిరోంచ, డిప్యూటీ కమాండర్‌గా పనిచేసింది. 2007 నుంచి మణుగూర్ దళ కమాండర్‌తో పాటు పార్టీ ఆదేశాల మేరకు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ పరిధిలో ఏరియా కార్యదర్శిగా, వైద్య బృందానికి బాధ్యురాలిగా 2011 వరకు పనిచేసింది. అ తర్వాత 2021 వరకు బస్తర్‌లో వివిధ క్యాడర్‌లో పనిచేసి 2022లో స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలుగా మంజుల బాధ్యతలు స్వీకరించింది. 2013లో దర్బా డివిజన్‌లో జీరంఘాటి ప్రాంతంలో 27 మంది పోలీసులను హత్య చేసిన ఘటనతో పాటు చిట్యాల, నర్సంపేట, ఏటూరునాగారం, నెక్కొండ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పోలీసులుపై జరిపిన కాల్పుల్లో మంజుల నిందితురాలిగా ఉంది.

కాగా, అనారోగ్య సమస్యలతో పాటు, తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాసం పట్ల ఆకర్షితులై మంజుల లొంగిపోయినట్లు సీపీ తెలిపారు. కాగా, ఆమెపై ప్రభుత్వం ప్రకటించిన రూ.20 లక్షల రివార్డు చెక్కును అందజేశామన్నారు. తెలంగాణలో నక్సలిజంకు ఎలాంటి ఆదరణ లేదని, అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసి కుటుంబసభ్యులతో కలిసి సంతోషంగా గడపాలని సీపీ సూచించారు. ఈ సమావేశంలో ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, ఎస్సై రఘుపతి పాల్గొన్నారు.

## ముగిసిన జోనల్ క్రీడలు

ములుగు కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని జాకారం గురుకులంలో ఈనెల 11 నుంచి 14 వరకు జరిగిన రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ స్కూల్ 10వ జోనల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా ఎస్పీ శబరీశ్ హాజరయ్యారు. క్రీడలు మానసిక ఉల్లాసానికే కాకుండా కెరియర్‌గా కూడా ఎంచుకోవచ్చన్నారు. విద్యార్థులు సన్మార్గంలో నడిచి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. అనంతరం ఆల్ రౌండ్ పర్ఫార్మెన్స్ ట్రోఫీని జాకారం గురుకులం విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో జోనల్ అధికారి అరుణ కుమారి, డీసీవో శ్రీనివాసరావు, భిక్షపతి, జోనల్ సూపరింటెండెంట్ శ్రీనివాస రావు, కాళేశ్వరం జోన్ ప్రిన్సిపాళ్లు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.



జాకారం గురుకులం విద్యార్థులకు ట్రోఫీ అందజేస్తున్న ఎస్పీ శబరీశ్

# కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి సర్వే

**మహబూబాబాద్ జిల్లాలో ఆరు రోజుల్లో 1,19,757 కుటుంబాల గణన పూర్తి**

మహబూబాబాద్ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వేగవంతంగా కొనసాగుతోంది. మహబూబాబాద్ జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలు తొర్రూరు, మరిపెడ, డోర్నకల్, మానుకోటలతో పాటు 18 మండలాల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మొత్తంగా కలిపి 2,66,603 కుటుంబాలను గుర్తించారు. ఈనెల 14 వరకు 1,19,757 (44.9 శాతం) కుటుంబాల సర్వేను పూర్తి చేశారు. కాగా, జిల్లాలోని 18 మండలాల పరిధిలో 2,27,758 కుటుంబాలకు గాను 1,01,462 కుటుంబాల సర్వే పూర్తయింది. నాలుగు మునిసిపాలిటీల పరిధిలో 38,845 కుటంబాలకు గాను 18,295 కుటంబాల సర్వే పూర్తయింది.



కొత్తపేటలో సర్వే చేస్తున్న అధికారులు

ఈ నెల 6 నుంచి సమగ్ర ఇంటింటి కుటంబ సర్వే ఆరంభం కాగా 8 వరకు సర్వే చేపట్టే ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి కుటుంబ యాజమాని పేర్లు రాసుకుని ఇంటికి స్టిక్కర్‌ను వేశారు. ఈనెల 9 నుంచిపూర్తి స్థాయిలో కుటుంబ సభ్యుల వివరాలతో పాటు కులగణన ప్రారంభమైంది. తొలి రెండురోజులు కాస్త నెమ్మదిగా సాగిన సర్వే క్రమక్రమంగా వేగం పుంజుకుంది. ఆరు రోజుల్లో 1,19,757 కటుంబాల సర్వే పూర్తి చేశారంటే సగటున ప్రతి రోజు జిల్లా వ్యాప్తంగా 20 వేల కుటుంబాల సర్వేను పూర్తి చేశారు. ఈనెల 21 వరకు ఇం టింటి సర్వే కొనసాగించి వివరాలను ఈనెల 30 వరకు ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ పూర్తి చేయనున్నారు.



గూడూరులో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణవేణి

**జిల్లాలో ఈ నెల 14 వరకు సర్వే వివరాలు**

| మండలం | కుటుంబాలు | సర్వే పూర్తయినవి |
|---|---|---|
| బయ్యారం | 15414 | 7277 |
| చిన్నగూడూరు | 5347 | 2840 |
| దంతాలపల్లి | 9724 | 5210 |
| డోర్నకల్ | 12623 | 5054 |
| గంగారం | 3791 | 1858 |
| గార్ల | 13,228 | 6713 |
| గూడూరు | 18572 | 8311 |
| ఇనుగుర్తి(కేసముద్రం) | 3926 | 1624 |
| ఇనుగుర్తి (నెల్లికుదురు) | 2461 | 982 |
| కేసముద్రం | 18686 | 9114 |
| కొత్తగూడ | 10118 | 4835 |
| కురవి | 16712 | 5806 |
| మహబూబాబాద్ | 14142 | 5839 |
| మరిపెడ | 20461 | 8596 |
| నర్సింహులపేట | 9990 | 4025 |
| నెల్లికుదురు | 16829 | 6576 |
| పెద్దవంగర | 10045 | 5768 |
| సీరోలు (డోర్నకల్) | 2190 | 854 |
| సీరోలు (కురవి) | 5511 | 2090 |
| తొర్రూరు | 17988 | 8090 |
| మునిసిపాలిటీలు | | |
| డోర్నకల్ | 4171 | 2232 |
| మహబూబాబాద్ | 21432 | 10010 |
| మరిపెడ | 5293 | 2699 |
| తొర్రూరు | 7949 | 3354 |
| మొత్తం | 2,66,603 | 1,19,757 |

## మావోయిస్టుల కదలికలపై నిఘా పెట్టాలి

**భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే ▸▸ మహదేవపూర్ పీఎస్ తనిఖీ**



పోలీసు సిబ్బంది ఆయుధాలు, సామగ్రిని పరిశీలిస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే

మహదేవపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల కదలికలపై పటిష్ఠ నిఘా పెట్టాలని పోలీసు సిబ్బందిని భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశించారు. మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి కేసుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది పనితీరు, వారు ఉపయోగిస్తున్న ఆయుధాలను, సామగ్రిని పరిశీలించారు.

సీసీ కెమెరాల ఏర్పాటు, నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, పెండింగ్ కేసులపై సత్వర చర్యలు చేపట్టాలని సీఐ రాంచందర్‌రావు, ఎస్సై పవన్‌కుమార్‌ను ఆదేశించారు. మహదేవపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న దృష్ట్యా నిరంతరం అప్రమత్తంగా ఉంటూ మావోయిస్టుల కదలికలపై పటిష్ఠ నిఘా ఉంచాలన్నారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్పీ మొక్కలు నాటారు. ఆయన వెంట కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.

## 'కార్తీక' శోభితం..

(5వ పేజీ తరువాయి)

ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొననున్నారు. ఈ మేరకు గురువారం ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా ముస్తాబు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు వీలుగా ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. వీటితోపాటు కళాబృందాల సంప్రదాయ నృత్యాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయి. అలాగే హనుమకొండలోని షిరిడీ సాయిబాబా ఆలయం, ములుగు రోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, దత్తక్షేత్రం, కాజీపేటలోని శ్వేతార్కమూల ఆలయం, హనుమకొండ రాగన్న దర్వాజలోని శ్రీ సీతారామ ఆలయం, చిన్నకోవెల, ఎక్సైజ్‌కాలనీలోని వేంకటేశ్వరాలయం, బాలసముద్రంలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించేందుకు ఆలయ కమిటీలు ఏర్పాటు చేశాయి. అలాగే వరంగల్ నగరంలోని శ్రీ వరద దత్తక్షేత్రంలో పౌర్ణమి హోమం, అభిషేకం నిర్వహించనున్నారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలకు ఏర్పాట్లు చేశారు. భద్రకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగనున్నాయి. అలాగే అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు, సామూహిక లలిత సహస్ర నామ పారాయణం చేస్తారు.

మహిళలు ఆలయాల్లో వత్తులు కాల్చడంతో పాటు దీపాలు వెలిగించి నైవేద్యం నివేదన చేసి పూజలు చేయనున్నారు. 365 వత్తులు, 1008 వత్తులు, లక్ష వత్తులు కాలుస్తారు. పలు చోట్ల ప్రసాద వితరణకు ఏర్పాట్లు చేశారు. వరంగల్ భద్రకాళి ఆలయ రోడ్డులోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప భక్త సేవాశ్రమంలో శుక్రవారం ప్రత్యే క పూజలు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ టీఆర్. బాలసుబ్రహ్మణ్య శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజామున అభిషేకం, భక్తుల ముద్ర మాలలకు పూజ అనంతరం అయ్యప్ప భక్తుల మాలాధారణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొదటిసారి అయ్యప్ప మాల వేసుకునే భక్తులకు ఉచితంగా మాలాధారణ చేసి స్వామి వారి శేషవస్త్రం, ప్రసాదం అందించనున్నట్లు ఆయన వివరించారు.

### సోమేశ్వర ఆలయంలో అఖండజ్యోతి

కార్తీక పౌర్ణమి సందర్భంగా దక్షిణ భారతదేశంలో అఖండజ్యోతిని నిర్వహిస్తున్న మూడో దేవస్థానంగా పాలకుర్తి శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి గుర్తింపు ఉంది. ఈ ఆలయంలో శుక్రవారం అఖండజ్యోతి గిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు చేసినట్టు ఈవో సల్వాది మోహన్‌బాబు తెలిపారు. అరుణాచలం స్ఫూర్తితో పాలకుర్తి ఆలయ గుట్టపై 8 అడుగుల వెడల్పు, 4అడుగుల ఎత్తులో ప్రత్యేకంగా రూపొందించిన ప్రమిదలో ఒక టన్ను నువ్వుల నూనె, ఆవునెయ్యి రెండు క్వింటాళ్ల ముద్ద కర్పూరంతో అఖండజ్యోతిని వెలిగించనున్నట్లు తెలిపారు. వేలాదిగా తరలివచ్చే భక్తుల సమక్షంలో లక్ష దీపోత్సవం, గిరి ప్రదక్షిణ, అఖండజ్యోతి 5గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

ఉత్తరకాశి పీఠాధిపతి స్వామి స్థితప్రజ్ఞానంద సరస్వతి, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి హాజరై అఖండజ్యోతిని ప్రారంభిస్తారన్నారు. అలాగే జనగామ బాణాపురం వేంకటేశ్వర స్వామి దేవాలయంలో లక్ష దీప మహోత్సవం, కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ప్రధానార్చకులు కృష్ణమాచార్య సిద్ధాంతి తెలిపారు.

బచ్చన్నపేట మండలం కొడవటూరు సిద్దులగుట్ట కార్తీకపౌర్ణమి ఉత్సవాలకు ముస్తాబైంది. శుక్రవారం తెలవారుజాము నుంచే సిద్ధేశ్వరుడికి విశిష్ట అభిషేకాలు, అన్నపూజలు, మహారుద్రాభిషేకాలు నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్తీకదీపాలు వెలిగించనున్నారు. స్వామి సన్నిధిలో సత్యనారాయణ వ్రతాలు చేసి మొక్కులు చెల్లిస్తారు. ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్ల కోసం సిబ్బంది శ్రీనివాస్, చల్లా లక్ష్మీకాంతరెడ్డి, భానుప్రకాశ్‌రెడ్డిలను నియమించామని ఈవో చిందం వంశీ తెలిపారు.



గంజాయిని దహనం చేస్తున్న ఏఎస్పీ జోగుల చెన్నయ్య

## రూ.1.28కోట్ల విలువైన గంజాయి దహనం చేసిన పోలీసులు

మహబూబాబాద్ రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా సీజ్ చేయబడిన 1.28 కోట్ల విలువైన గంజాయిని కాకతీయ మెడికల్ ఏజెన్సీ, ఉర్సుగుట్ట హన్మకొండలో మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆదేశాల మేరకు డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ సభ్యులు, ఏఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీ తిరుపతిరావు సమక్షంలో 515 కేజీల 720 గ్రాముల గంజాయిని గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన 24 కేసుల్లో మొత్తం 515 కేజీల 720 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన గంజాయిని గత కొంత కాలంగా నిల్వ చేసి గురువారం దగ్ధం చేసినట్లు చెప్పారు. గంజాయి, డ్రగ్స్ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐలు సత్యనారాయణ, పెండ్యాల దేవేందర్, రాజేష్, బాబురావు, రవి తదితరులు పాల్గొన్నారు.

## రక్తపు వాంతులతో వ్యక్తి మృతి

**హత్యగా భావించి భయపడిన ప్రజలు**

కేసముద్రం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం తెల్లవారుజామున గూడూరు మండలం రాజన్‌పల్లి కాలనీతండాకు చెందిన ధరావత్ రవీందర్ (27) రక్తం వాంతులు చేసుకొని మృతి చెందినట్లు ఎస్ఐ మురళీధర్‌రాజ్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం. కూలీ పని చేస్తూ జీవించే రవీందర్ కొంతకాలంగా టీబీ వ్యాధితో బాధపడుతున్నాడు. బుధవారం గుంటూరులోని ఒక ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం వెళ్లి తిరిగి కేసముద్రం రైల్వేస్టేషన్‌కు గురువారం తెల్లవారుజామున చేరుకున్నాడు. రైల్వేస్టేషన్ ఆవరణలో రక్తం వాంతులు వస్తుండగా అక్కడి నుంచి బయటకు నడుచుకుంటూ వచ్చి కుర్చొని మరింత రక్తం వాంతి చేసుకొని మృతి చెందాడు. తెల్లవారుజామున రైల్వేస్టేషన్ ఆవరణలో రవీందర్ మృతదేహం ముఖంపై రక్తం ఉండడంతో హత్య జరిగిందని భావించి, మండల కేంద్రంలో కలకలం రేపింది. అనంతరం జరిపిన ప్రాథమిక విచారణలో రవీందర్ మృతిపై స్పష్టత వచ్చింది. ఈ మేరకు మృతిని భార్య అనూష ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు మహబూబాబాద్‌కు తరలించారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు. ఘటనా స్థలాన్ని మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, జీఆర్‌పీ సీఐ పి. సురేందర్ పరిశీలించారు.



మృతి చెందిన రవీందర్

## అప్పు తీర్చడం లేదని హత్య

**జనగామ జిల్లా ఎల్లారెడ్డిగూడెంలో ఘటన**

రఘునాథపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అప్పు తీసుకుని డబ్బులు తిరిగి ఇవ్వలేదనే కారణంతో అప్పు ఇచ్చిన వ్యక్తి హత్య చేసిన ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. గంపల పరశురా ములు(40)కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తాపీమేస్త్రీ పనిచేస్తూ, పెళ్లిళ్ల సీజన్‌లో బ్యాండ్ వాయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొద్ది నెలల క్రితం అనారోగ్యానికి గురైన పరశురాములు భార్య చికిత్స కోసం ఇదే గ్రామానికి చెందిన పర్వత మహేందర్ వద్ద అప్పు తీసుకున్నాడు. తీసుకున్న అప్పు తీర్చాలని మహేందర్ కొద్దిరోజుల నుంచి కోరుతూ వస్తున్నాడు. ఇదిలా ఉంటే మహేందర్ ఇల్లు కట్టుకోగా పరశురాములు నిర్మాణ పనులు చేపట్టాడు. తీసుకున్న అప్పు ఇంటి పనులతో తీరిందని పరశురాములు, లేదు ఇంకా డబ్బులు రావాలని మహేందర్ ఎవరికివారే చెబుతున్నారు. ఇదే విషయంపై కొద్ది రోజులుగా గొడవ జరుగుతోంది. అయితే మహేందర్ నుంచి పరశురాములు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు అప్పు తీసుకుని ఉంటాడని గ్రామస్థులు చెబుతున్నారు. మహేందర్ స్థానికంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తాడని తెలిసింది.

### ఫోన్ చేసి పిలిచి.. భార్యా పిల్లల ఎదుటే హత్య..

పరశురాములు ఎల్లారెడ్డిగూడెంలో బుధవారం రాత్రి జరిగిన పెళ్లి వేడుకల్లో అర్ధరాత్రి వరకు పాల్గొన్నాడు. తర్వాత ఇంటికి వెళ్లి పడుకోవడానికి ఉపక్రమిస్తున్న సమయంలో మహేందర్ అతడికి ఫోన్ చేసి గ్రామంలోని బొడ్రాయి వద్దకు రావా లని కోరాడు. అప్పటికే అతిగా మద్యం సేవించిన మహేందర్, పరశురాములు అక్క డికి రాగానే కత్తి(తల్వార్)తో తలపై వేటు వేశాడు. తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడి కక్కడే కుప్పకూలి మృతి చెందాడు. భర్త వెనుకాలే వెళ్లిన పరశురాములు భార్య సంధ్య, కుమారుడు అనిరుధ్ చూస్తుండగానే మహేందర్ కత్తితో దాడి చేసి హత్య చేశాడు. దీంతో భయభ్రాంతులకు గురై కేకలు వేయడంతో గ్రామస్థులు అక్కడికి చేరుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారమివ్వగా రఘునాథపల్లి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ డి.నరేష్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ జిల్లా ఆస్పత్రికి తరలించారు. నిందితుడు మహేందర్‌ను అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ విచారణ చేపట్టారు.

### గ్రామంలో విషాదం..

పరశురాములు హత్యకు గురవడంతో ఎల్లారెడ్డిగూడెం విషాదం నెలకొంది. మృతుడి భార్య సంధ్య, కుమారుడు, కుమార్తె రోదన గ్రామస్థులను కలచివేసింది. హత్యకు పాల్పడిన మహేందర్‌పై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తు కఠినంగా శిక్షించాలని పోలీసులను డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు కొయ్యడ మల్లేష్, సుధాకర్, కుమార్ పరామర్శించారు.

### హత్యకు కారణం ఇదేనా ?

పరశురాములు తన భార్య సంధ్య చికిత్స నిమిత్తం పర్వత హహేందర్ నుంచి రూ.80 వేలు అప్పుగా తీసుకున్నట్లు తెలుస్తుంది. తాపీమేస్త్రీగా పని చేసే పరశు రాములు, మహేందర్‌కు సంబంధించిన కొత్త ఇంటి నిర్మాణం పనులు చేసి అప్పు గా తీసుకున్న డబ్బులు తీర్చినట్లు మృతుడి బంధువులు చెబుతున్నారు. అప్పుగా తీసుకున్న రూ.80 వేలలో సుమారు రూ.50 వేల వరకు మాత్రమే పరశురాములు, అతడి భార్య ఇంటి నిర్మాణ పనులు చేసి అప్పు తీర్చినట్లు తెలుస్తోంది. రూ. 50వేల విలువ గల ఇంటి నిర్మాణ పనులు చేయకుండానే చేసినట్లు చెబుతుండడంతో ఇద్ద రి మధ్య విభేదాలు ఏర్పడినట్లు సమాచారం.

### నిందితుడిని కఠినంగా శిక్షించాలి

పరశురాములును హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద హత్యను ఖండిస్తూ గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరశురాములు హత్యపై ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని, హంతకుడిపై పీడీ యాక్టు నమోదు చేసి, బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, దళితులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొయ్యడ మల్లేష్, జేరిపోతుల సుధాకర్, బొల్ల పల్లి కృష్ణ, గిరిమల్ల రాజు, ప్రభాకర్, రాగల ఉపేందర్, డీ రవి, అబ్బయ్య, ఎల్లయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.




హత్యకు గురైన గంపల పరశురాములు

# కందికొండకు కార్తీక శోభ

**నేడు లక్ష్మీనర్సింహస్వామి జాతర**

- పది జిల్లాల నుంచి తరలిరానున్న భక్తజనం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారగణం
- ప్రత్యేక ఆకర్షణగా అఖండజ్యోతి
- మానుకోట, తొర్రూరు నుంచి బస్సులను నడుపనున్న ఆర్టీసీ




పురాతన కాలంలో గుట్టపై నుంచి పడిన రాయికి జాతర సందర్భంగా రంగులు వేయించిన నిర్వాహకులు



కురవి మండలంలోని కందికొండ ఆలయంపై వెలిగించనున్న అఖండదీపం

కురవి, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కందికొండ జాతర శుక్రవారం కందిగిరి పర్వతంపై జరుగనుంది. కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని ప్రతీ సంవత్సరం నర్సింహస్వామి, లక్ష్మీదేవీల జాతర నిర్వహిస్తారు. గిరిజన, గిరిజనేతరులు తరలివచ్చే ఈ జాతర కోసం అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ జాతరకు పూర్వపు వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లోని భక్తులు వేలాదిగా హాజరవుతారు. దీంతో జాతర రద్దీగా మారనుంది.

### 200 మందితో పోలీసుల బందోబస్తు..

కందికొండ జాతర కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశాల మేరకు మరిపెడ సీఐ రాజ్‌కుమార్, సీరోలు ఎస్సై నగేష్, కురవి, సీరోలు తహసీల్దార్‌లు సునీల్‌రెడ్డి, శారద, ఎంపీడీవో వీరబాబులు పది రోజులుగా కందికొండ గుట్టను సందర్శించి, ఏర్పాట్లను పర్యవేక్షించారు. జాతర కోసం తొర్రూరు డీఎస్పీ కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో ఏడుగురు సీఐలు, 20 మంది ఎస్సైల ఆధ్వర్యంలో మొత్తం 200మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. అంతేకాకుండా దొంగతనాల నివారణకు సీసీఎస్ టీమ్‌లు, ఈవ్‌టీజర్ల అదుపునకు సివిల్‌డ్రెస్సుల్లో ఉన్న షీ టీమ్స్ అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. భక్తులకు తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో నీటివసతి, నాలుగుచోట్ల ఆరోగ్య శిబిరాలను ఏర్పాటుచేసినట్లు తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఎంపీడీవో వీరబాబు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు రవాణా కోసం మహబుబ్బాబాద్ బస్‌డిపో కందికొండకు స్పెషల్ బస్సులను నడుపనుంది.

### జాతర ఏర్పాట్లు పరిశీలించిన ప్రభుత్వవిప్

కార్తీకపౌర్ణమి శుక్రవారం రోజున కురవి మండలం కందికొండలో జరిగే శ్రీలక్ష్మీనర్సింహస్వామి జాతర ఏర్పాట్లను ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌నాయక్ గురువారం పర్యవేక్షించారు. జాతరకు ఉన్న రెండు మార్గాలను పర్యవేక్షించి, పలు సూచనలు చేశారు. నడిచి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా వసతి ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారని, అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కృష్ణారెడ్డి, పీఆర్ ఈఈ పోరిక విద్యాసాగర్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం, మాజీ జడ్పీటీసీ బండి వెంకట్‌రెడ్డి, మానుకోట మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, కోర్ని రవీందర్‌రెడ్డి, బండి లక్ష్మారెడ్డి, బాలగాని శ్రీనివాస్, గొల్లపల్లి రజినీకాంత్ పాల్గొన్నారు.

### దొంగలపై నిఘా పెట్టాలి : ఎస్పీ

కందికొండ జాతర బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ పరిశీలించారు. జాతర సమయంలో దొంగలపై నిఘా పెట్టాలని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్పీవెంట తొర్రూరు డీఎస్పీ కృష్ణకిశోర్, మరిపెడ సీఐ రాజ్‌కుమార్, సీరోలు ఎస్సై నగేష్‌లు ఉన్నారు.



కురవి కందికొండ జాతర ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌నాయక్

### తెల్లవారు జామునే కల్యాణోత్సవం

లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవాలు శుక్రవారం తెల్లవారుజామున 3గంటల నుంచే మొదలవుతాయి. స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి, మంగళశాసనములు గావించి, కల్యాణ మహోత్సవాన్ని ఉదయం సమయాన్నే పూర్తి చేస్తారు. తర్వాత భక్తులు స్వామివారిని దర్శించుకొంటారు.

### ప్రత్యేక ఆకర్షణగా అఖండజ్యోతి

ఆపై సాయంత్రం సమయంలో మట్టి మూకుడులో కందికొండ ఆలయంపై భాగాన అఖండజ్యోతిని వెలిగిస్తారు. ఈ మూకుడు నిండా నూనె పోసి, వస్త్రముతో మడత వేసి పెద్ద వత్తిగా చేసి వెలిగిస్తారు. ఈ దీపంలో నూనెను కందికొండ గ్రామానికి చెందిన ముస్లింలు అందించడం విశేషం. తరతరాలుగా ముస్లింలు నూనెను అందించడం ఆచారంగా వస్తోంది. ఈ అఖండజ్యోతి చుట్టు ప్రక్కల 40కిమీవరకు కనిపిస్తుంది.

## జాతరకు ప్రత్యేక బస్సులు

- మానుకోట డీఎం శివప్రసాద్

మహబూబాబాద్ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కురవి మండలం కందికొండ జాతరకు మహబూబాబాద్ డిపో నుంచి ప్రత్యేకంగా మూడు బస్సులను నడుపుతున్నట్లు స్థానిక ఆర్టీసీ డీఎం శివప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దలకు రూ.50, పిల్లలకు రూ.30 టికెట్ చార్జీలను నిర్ణయించడం జరిగిందన్నారు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ బస్సులు మహబూబాబాద్ నుంచి కురవి మీదుగా కందికొండకు నడపనున్నట్లు చెప్పారు. అదే విధంగా సూర్యాపేటకు వెళ్లే 14 బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

### తొర్రూరు నుంచి..

తొర్రూరు : కార్తీక పౌర్ణమిని పుస్కరించుకుని పంచ రామాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తొర్రూరు ఆర్టీసీ డిపో మేనేజర్ పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈనెల 17, 18 తేదీలలో తొర్రూరు డిపో నుంచి అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటకు శివభక్తుల కోసం ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. రెండు రోజులకుగాను పెద్దలకు రూ.1,990, పిల్లలకు రూ.1010 చార్జీలు ఉంటాయని, మరిన్ని వివరాలకు ఫోన్ : 7382949420, 9989148306 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## సమగ్ర సమాచారాన్ని సేకరించాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ప్రతీ ఇంటికి వెళ్లి ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో సేకరించిన సమాచారాన్ని 'ఆన్‌లైన్‌'లో డేటా ఎంట్రీ నమోదు కోసం ఇప్పటికే ఆపరేటర్లకు శిక్షణ ఇవ్వడం జరిగిందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 973 మంది ఆపరేటర్లు సిద్ధంగా ఉన్నారని ,కంప్యూటర్, ల్యాప్‌టాప్స్ సమకూర్చుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం వివరాలు పక్కాగా నమోదు చేయాలన్నారు. జిల్లాలో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల అధికారులు కొనుగోళ్లలో జాప్యం జరగకుండా చూడాలన్నారు. కొత్తగూడ మండల కేంద్రంలో గురువారం గిరిజన కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించడం జరిగిందన్నారు. తొర్రూరు మండల కేంద్రంలో బాలాజీ ఇండస్ట్రీలో కాటన్ కొనుగోళ్లను జిల్లా మార్కెటింగ్ అధికారి సందర్శించడం జరిగిందన్నారు. గ్రూప్-3 పరీక్షల నిర్వహణ కోసం నియమించిన ప్రత్యేకాధికారులు సంబంధిత పరీక్ష కేంద్రాల్లో వసతులు, ఏర్పాట్లను పరిశీలించడం జరిగిందన్నారు. జడ్పీ సీఈవో పురుషోత్తం, డిప్యూటీ సీఈవో నర్మద, డీపీవో హరిప్రసాద్ పాల్గొన్నారు.

## రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మొద్దు

- జిల్లా వ్యవసాయాధికారి విజయ నిర్మల



ధాన్యం రాసుల వద్ద రైతులతో మాట్లాడుతున్న విజయనిర్మల

దంతాలపల్లి, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు గ్రామాల్లో విక్రయించొద్దని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల అన్నారు. గురువారం ఆమె దంతాలపల్లిలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఇటీవల ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వం సన్నధాన్యంకు రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. నాణ్యత ప్రమాణాలు ఉన్న ధాన్యాన్ని వెంటనే కాంటా చేయాలని సీఈవో వెంకన్నను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యంకు ప్రభుత్వం వారంలోగా తమ తమ బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. తహసీల్దార్ రాజేశ్వర్‌రావు, ఏవో వాహిని, ఏఈవోలు దీక్షిత్‌కుమార్, శిరీష, సీఈవో వెంకన్న పాల్గొన్నారు





కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు మొక్కను అందిస్తున్న అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి



## అదనపు కలెక్టర్‌గా వీరబ్రహ్మచారి బాధ్యతల స్వీకరణ

మహబూబాబాద్ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా కె.వీరబ్రహ్మచారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ఆర్డీవోలు, అదనపు కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసిన విషయం విధితమే. అందులో భాగంగా ఇక్కడ అదనపు కలెక్టర్‌గా పని చేసిన ఎం.డేవిడ్ బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో హైదరాబాద్ నుంచి కె.వీరబ్రహ్మచారి ఇక్కడకు వచ్చారు. జిల్లా కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో అదనపు కలెక్టర్‌గా వీరబ్రహ్మచారి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకుని మొక్కను అందించారు. కాగా, వీరబ్రహ్మచారి గతంలో జయశంకర్ భూపాలపల్లి, మెదక్, సూర్యాపేట జిల్లాలో రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్‌గా, నల్లగొండ జడ్పీ సీఈవోగా పని చేశారు.

### మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

కేసముద్రం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా మూడు రోజులపాటు సెలవులు ఉన్నట్లు చైర్మన్ గంట సంజీవరెడ్డి గురువారం తెలిపారు. ఈనెల 15న గురునానక్ జయంతి, 16, 17 శని, ఆది వారాంతపు సెలవులు ఉన్నాయన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి. తిరిగి తమ సరుకులను ఈనెల 18న తీసుకురావాలని కోరారు.

### నేడు డయల్ యవర్ డీఎం ప్రోగ్రాం

- మానుకోట డిపో మేనేజర్ శివప్రసాద్

మహబూబాబాద్ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ ఆర్టీసీ డిపోలో శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5వరకు డయల్ యువర్ డీఎం ప్రోగ్రాంను నిర్వహిస్తున్నట్లు డీఎం శివప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెల్‌నంబర్‌కు 85003 24880కు ఫోన్‌చేసి సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- విద్యుత్ అధికారులు 'గృహలక్ష్మి' పథకాన్ని పక్కాగా అమలు చేయాలి
- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ హెచ్చరించారు. జిల్లా కేంద్రం శివారు ఆర్మీ గార్డెన్‌లో 'విద్యుత్ పొదుపు-ప్రమాదాల నివారణ'పై విద్యుత్ అధికారులకు అవగాహన సదస్సును గురువారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా గృహజ్యోతి పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఇంకా కొంతమంది లబ్ధిదారులకు జీరో విద్యుత్ బిల్లు రావడం లేదని, వారు తమ వద్దకు వచ్చి ఫిర్యాదులు చేస్తున్నారని చెప్పారు. వారందరికి జీరో బిల్లు వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈనెల 30 వరకు బీపీఎల్ విద్యుత్ మీటరు మంజూరు కోసం గడువు ఉందని, ఇంకా ఎవరైనా మీటర్ లేని లబ్ధిదారులను గుర్తించి విద్యుత్ అందించాలని ఆదేశించారు. రైతులకు 24 గంటలు విద్యుత్ సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన రైతులకు స్పెషల్ ఫండ్ కింద స్తంభాలు, విద్యుత్ వైర్లు ఉచితంగా ప్రభుత్వమే అందిస్తుందని, ఈ విషయాన్ని రైతులకు అవగాహన కల్పించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యుత్ శాఖ అధికారి నరేష్, డీఈలు విజయ్, పెద్దిరాజు, సునిత, ఏడీ ప్రశాంత్, ఏఈలు సంగీత, నవ్యశ్రీ, ఏఎల్ఎంలు పాల్గొన్నారు.



నాగారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

### వడ్ల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ఇనుగుర్తి : ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. నాగారంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాల్లోని ప్రమాణాలను పాటిస్తూ ధాన్యం తీసుకువస్తే తప్పనిసరిగా ప్రభుత్వ మద్దతుధర లభిస్తుందని అన్నారు. కాంగ్రెస్ జిల్లా ప్రచార కార్యదర్శి బైరు అశోక్, మండల పార్టీ అధ్యక్షుడు కూరెల్లి సతీష్, తుమ్మనపల్లి సతీష్, గ్రామైక్య సంఘం నాయకులు నాయని కోమలత, బైరు శ్రీమతి పాల్గొన్నారు.

## వికారాబాద్ కలెక్టర్‌పై దాడి హేయమైన చర్య

- కలెక్టరేట్ ఎదుట ఉద్యోగుల నిరసన

మహబూబాబాద్ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ కలెక్టర్ ప్రీపత్‌జైన్, ఇతర అధికారులపై దాడులు చేయడం హేయమైన చర్య అని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా చైర్మన్ వడ్డెబోయిన శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ రఫీ అన్నారు. వికారాబాద్ కలెక్టర్, ఇతర అధికారులపై దాడులను నిరసిస్తూ మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నభోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజల కోసం పని చేస్తున్న ఉద్యోగులపై దాడులు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో భగవాన్‌రెడ్డి, వేముల సురేష్, పవన్‌కుమార్, రాజు, విజయ, నారాయణమూర్తి, భద్రకాళి, కొప్పు ప్రసాద్, సోమ్లానాయక్, పమ్మి నాగబ్రహ్మచారి, రంజిత్, వెంకన్న పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

- చిన్నగూడూరు : వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై జరిగిన దాడిని వ్యతిరేకిస్తూ చిన్నగూడూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉద్యోగ జేఏసీ పిలుపు మేరకు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి మండల ప్రభుత్వ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రామారావు మాట్లాడారు. కార్యదర్శులు సోమన్న, అజీం, దాను, శ్రీకాంత్, సాగర్, ఏపీవో మాధవి, ఏపీఎం పాపయ్య, కార్యాలయ సిబ్బంది వెంకన్న, ఆదిబాబు పాల్గొన్నారు.

# ఘనంగా జవహర్‌లాల్ నెహ్రూ జయంతి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : భారత తొలి ప్రధాని, దివంగత జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను గురువారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మానుకోట పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నెహ్రూ జయంతిని నిర్వహించారు. నెహ్రూ విగ్రహానికి ఎమ్మెల్యే మురళీనాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాభ్యున్నతికి జవహర్‌లాల్ నెహ్రూ చేసిన సేవలు మరువలేనివని చెప్పారు. ఖలీల్ పాషా, గుగులోతు వెంకట్, ఎమ్మీ, హరుణ్, గుగులోతు వెంకట్, ఆరెందుల వెంకటేశ్వర్లు, రామగోని రాజు గౌడ్, బోడ రవినాయక్, బానోత్ ప్రసాద్, కోడి శ్రీను, భూక్య రవి, సిరిపురం వీరన్న, పింద్రాల రాందాసు, మాదరబోయిన యాకన్న, సల్వాది దిలీప్, భూక్య లక్ష్మి, సీతారాములు, దండెం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

● మానుకోట ఎంపీ క్యాంపు కార్యాలయంలో నెహ్రూ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఎన్ఎస్‌యూఐ జిల్లాఅధ్యక్షుడు షేక్ రియాజ్‌అన్సారీ, ఇస్లావత్ రమేష్, షేక్. ముజ్జు, సురేష్, వినయ్, ఇంతియాజ్, బండపల్లి కృష్ణ, సాగర్, సూర్య ప్రసాద్ పాల్గొన్నారు.



మానుకోటలో నెహ్రూ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భూక్యమురళీనాయక్

**వివిధ మండలాల్లో..**

● మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని పలు పాఠశాలల్లో నెహ్రూ జయంతిని పురస్కరించుకునిబాలల దినోత్సవాన్ని నిర్వహించారు. స్వయం పరిపాలన దినోత్సవాలను జరుపుకున్నారు. మరిపెడ మోడల్ స్కూల్ విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వవిప్ రాంచందర్‌నాయక్ స్వయం పరిపాలన విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ సత్తార్, జిల్లా కాంగ్రెస్ నాయకులు వంటి కొమ్ము యుగేందర్‌రెడ్డి, తాజుద్దీన్, మార్కెట్ వైస్ చైర్మన్లు ఐలిమల్లు , బట్టునాయక్ పాల్గొన్నారు.

● చిన్నగూడూరులోని సమర్థ విద్యానికేతన్‌లో నెహ్రూజయంతి వేడుకలను నిర్వహించారు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● తొర్రూరులో వికాస్ పాఠశాలలో వకృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కరస్పాండెంట్ తాళ్లపల్లి రమేష్ పాల్గొన్నారు. శ్రీవాణి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పట్టణంలో బాలల హక్కులపై అవగాహన ర్యాలీ చేపట్టారు.సీడబ్ల్యూసీ జిల్లా చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి, పినాకపాణి, ఎస్సై రాంజీనాయక్, టీచర్స్ లయన్స్‌క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● గార్లలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దనియాకుల రామారావు, యాకూబ్‌పాషా, ఎలమకంటి వెంకన్న, మందరాముగౌడ్, అశోక్, జవ్వాది శ్రీనివాస్, వీరస్వామి, బాబు పాల్గొన్నారు. స్థానిక సమతా స్కూల్, విశ్వశాంతి స్కూల్, జడ్పీఎస్ఎస్, సీతంపేట, గోపాలపురం పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈవో మంకిడి వీరభద్రం, ఉపాధ్యాయులు మాలోతు శివనాయక్, రాంచంద్రు పాల్గొన్నారు.

● డోర్నకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బ్రిలియంట్ హైస్కూల్, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెహ్రూ జయంతిని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈవో లక్ష్మా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● గంగారంలో నెహ్రూ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల అధ్యక్షుడు వెంకన్న, మాజీ ఎంపీపీ ఈసం రమ పాల్గొన్నారు.

● కొత్తగూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య ఆధ్వర్యలంఓ చిన్నారులచే కేక్ కట్ చేయించారు. ఈకార్యక్రమంలో శ్రీనివాస్, కృష్ణ, సమ్మయ్య, స్వామి, అఫ్సర, మౌలాన, నర్సయ్య పాల్గొన్నారు.

● కేసముద్రం విలేజ్‌లో శ్రీవివేకవర్ధిని హైస్కూల్‌లో స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. కరస్పాండెంట్ చిర్ర యాకంతం గౌడ్, ప్రిన్సిపాల్ నరేష్, నవీన్ పాల్గొన్నారు.

●బయ్యారంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



విజేతలకు హాట్సాఫ్ చెబుతున్న జడ్‌వో స్వరూపరాణి

## ఓవరాల్ చాంపియన్ మరిపెడ

● ఉత్కంఠగా సాగిన ఫైనల్స్ ● ముగిసిన భద్రాద్రి జోన్ స్పోర్ట్స్ మీట్

మరిపెడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి జోన్ స్పోర్ట్స్ మీట్‌లో మరిపెడ సోషల్ వెల్ఫేర్ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్స్‌గా నిలిచారు. నాలుగు రోజులుగా మరిపెడ సోషల్ వెల్ఫేర్ స్కూళ్లో కొనసాగుతున్న ఈ స్పోర్ట్స్ మీట్ ఫైనల్స్ ఉత్కంఠగా సాగాయి. పరకాల-మరిపెడ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌ను జడ్‌వో స్వరూపరాణి, తొర్రూరు డీఎస్పీ క్రిష్ణకిశోర్ వీక్షించారు. ఈ స్పోర్ట్స్ మీట్ విజేతలకు భద్రాద్రి జోన్ జోనల్ ఆఫీసర్ స్వరూపరాణి, తొర్రూరు డీఎస్పీ క్రిష్ణకిశోర్ మెమెంటోలను బహూకరించారు. గెలుపొందిన జట్లు కేరింతలతో హోరెత్తించారు. ఎంతో ఉత్సాహంగా జరిగిన ఈ స్పోర్ట్స్ మీట్ పోటీలకు కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల పరిధిలోని 11 గురుకుల పాఠశాలల నుంచి 11 రకాల ఈవెంట్ల కోసం 935మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ చాటారు.

**వివిధ విభాగాల్లో విజేతలు..**

**కబడ్డీ** : దమ్మపేట-టీపాలెం, మరిపెడ-అక్కిరెడ్డిపల్లి, మరిపెడ-పరకాల

**ఖోఖో** : మరిపెడ-మణుగూరు, మరిపెడ-వర్ధన్నపేట, మరిపెడ-పరకాల

**వాలీబాల్ (అండర్ 17, 19)** : టీపాలెం-నర్సంపేట, టీపాలెం-దమ్మపేట

**బాల్‌బ్యాడ్మింటన్** : మరిపెడ-దమ్మపేట, దమ్మపేట-మరిపెడ

**హ్యాండ్‌బాల్** : దమ్మపేట-వర్ధన్నపేట, దమ్మపేట-టీపాలెం

**ఫుట్‌బాల్** : పాల్వంచ-ముదిగొండ, పాల్వంచ-టీపాలెం

**టెన్నికాయిట్** : మరిపెడ-నర్సంపేట, మరిపెడ-పరకాల, మరిపెడ-దమ్మపేట

**చెస్‌సింగిల్** : పరకాల-అక్కిరెడ్డిపల్లి, పాల్వంచ-ముదిగొండ, ముదిగొండ-పాల్వంచ

**క్యారమ్స్ (డబుల్స్)** : నర్సంపేట-మణుగూరు, మరిపెడ-సత్తుపల్లి, టీపాలెం-అక్కిరెడ్డిపల్లి

**5కేరన్ (19)** : జె.గౌతమ్ (దమ్మపేట)- కె.రవిజేత (దమ్మపేట) విజేతలుగా నిలిచారు. వ్యక్తిగత ఓవరాల్ చాంపియన్స్‌గా ఎం.నితిన్ (మణుగూరు), కె.ఆనంద్ (అక్కిరెడ్డిపల్లి)కి దక్కింది.

### కష్టపడితేనే ఉజ్వల భవిష్యత్తు

**తొర్రూరు డీఎస్పీ క్రిష్ణకిశోర్**

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకొని ఇష్టంతో ఆటల్లో-చదువులో కష్టపడితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తొర్రూరు డీఎస్పీ క్రిష్ణకిశోర్ అన్నారు. గురువారం భద్రాద్రి జోన్ స్పోర్ట్స్ మీట్ ఫైనల్ పోటీలను వీక్షించి, విజేతలకు మెమెంటోలను అందించి డీఎస్పీ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. జడ్‌వో స్వరూపరాణి, సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, ప్రిన్సిపాల్ దయాకర్, పీడీ వంగ రవి, పీఈటీ వెంకటేశ్వర్లు, ఆయా గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్, పీడీలు, పీఈటీలు, గైడ్, ఎస్కార్ట్ టీచర్లతో పాటు మీడియా ఇన్‌చార్జ్ నరేందర్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ అధికారులపై ప్రయాణికుల ఆగ్రహం

తొర్రూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తొర్రూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గురువారం సాయంత్రం ఆర్టీసీ అధికారుల తీరు, సిబ్బందిపై ప్రయాణీకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్, జగద్గిరిగుట్ట, హన్మకొండ వెళ్లే బస్సు సర్వీసులను ఆర్టీసీ డ్రైవర్‌లు ప్రయాణీకులు దిగే వద్ద నిలపడంతో అక్కడే తిరిగి ఫుల్‌అయి పాయింట్ మీదికి రాకుండానే వెళ్తున్నాయి. దీంతో ప్రయాణీకులు తాము వెళ్లాల్సిన బస్సులను మిస్ అవుతున్నారు. బస్సుల వివరాలను ఆర్టీసీ అధికారులను అడగగా సరైన సమాధానం ఇవ్వక పోగా దురుసుగా ప్రవర్తించడంతో ప్రయాణీకులు గొడవకు దిగారు. బస్సులను తప్పనిసరిగా పాయింట్ వద్ద నిలపాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా తొర్రూరు బస్టాండ్ నుంచి హైదరాబాద్‌కు ప్రతీ రోజు తీవ్రమైన రద్దీ ఉంటుంది. దీంతో ఆర్టీసీ అధికారులు పూర్తిస్థాయిలో బస్సులు నడపలేకపోతున్నారనే ఆరోపణలున్నాయి. బస్సులు పాయింట్‌ల వద్దకు వచ్చిన తర్వాతే పంపాలని ప్రయాణీకులు కోరుతున్నా డ్రైవర్లు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రయాణీకులు ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఎక్స్ ద్వారా ఫిర్యాదు చేస్తామన్నారు. దీనిపై ఆర్టీసీ అధికారులను వివరణ కోరగా.. హైదరాబాద్ రూట్‌లో రద్దీ ఉంటుందని, బస్సులను నడుపుతున్నామన్నారు.



ఆర్టీసీ అధికారులతో గొడవపడుతున్న ప్రయాణికులు

**సంక్షిప్త వార్తలు**

### హామీల అమలులో సర్కార్ విఫలం

తొర్రూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు పర్చడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రాంమోహన్ రెడ్డి అన్నారు. గురువారం తొర్రూరులో జరిగిన సంస్థాగత వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ బీజేపీ సభ్యత్వ నమోదు విజయవంతంగా పూర్తవుతుందని, ప్రజాస్వామ్య బద్ధంగా పార్టీ రాజకీయంగా అభివృద్ధి చెందేందుకు కార్యకర్తలు కృషిచేయాలన్నారు. ఈ నెలాఖరులోగా బూత్ కమిటీలు పూర్తిచేసి మండల, జిల్లా అధ్యక్ష పదవులను ఎంపిక చేస్తామన్నారు. నాయకులు పూసల శ్రీమాన్, పల్లె కుమార్, రంగురాములు, రచ్చకుమార్, కాగు నవీన్, శేఖర్, విష్ణువర్ధన్, చలపతి ఉన్నారు.

### సీసీఐ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నర్సింహులపేట, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) : పత్తి రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. పడమటిగూడెం సమీపంలోని ఖమ్మం- వరంగల్ ప్రధాన రహదారి పక్కన ఉన్న బాలాజీ కాటన్ ఇండస్ట్రీస్ కంపెనీలో గురువారం సందర్శించి సీసీఐ పత్తి కొనుగోళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీసీఐ కొనుగోలు కేంద్రాలకు పత్తిని తీసుకొచ్చే రైతులు తేమశాతం 8 నుంచి 12 లోపు ఉండేటట్లు చూసుకుంటే మంచి మద్దతు ధర లభిస్తుందన్నారు. తొర్రూరు మార్కెట్ కార్యదర్శి నిరంజన్, డీఈవో వెంకన్న, సిబ్బంది, రైతులు ఉన్నారు.

### 'చిల్లంచర్ల గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి'

మహబూబాబాద్ టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం నుంచిమరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఆ గ్రామానికి చెందిన మేకల ప్రభు, సూత్రపు రాజు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో ఆర్టీసీ డీఎం శివప్రసాద్‌కు గురువారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం చిల్లంచర్ల గ్రామస్థుల రావాలంటే బస్సు సైకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సతీష్, శేఖర్, వేణు, నరేష్ పాల్గొన్నారు.

### మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ 23వవార్డులోకౌన్సిలర్ మార్నేని శ్రీదేవిరఘు నేతృత్వంలో దైవకృప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గత రెండునెలలుగా నిర్వహిస్తున్న కుట్టు మిషన్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన 100 మంది మహిళలకు గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, మునిసపల్ ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్ధన్, దైవ కృప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు బానోత్ లోకేష్, వీరన్న, సంపత్, బాలు, మార్నేని కిరణ్, నాగలక్ష్మి, వాణి, మనెమ్మ, రోజా, స్రవంతి, బిందు, దివ్య, నవ్య, భారతి పాల్గొన్నారు.

### రోడ్డు విస్తరణపై ప్రజల్లో ఆందోళన

కేసముద్రం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం అంబేద్కర్ సెంటర్ నుంచి విలేజిలోని దర్గా వరకు రోడ్డును వందఫీట్లతో విస్తరిస్తారనే విషయంలో ప్రజల్లో ఆందోళన నెలకొందని సీపీఐ మండల కార్యదర్శి చొప్పరి శేఖర్, సహాయ కార్యదర్శి మంద భాస్కర్ అన్నారు. కేసముద్రంలో గురువారం వారు మాట్లాడుతూ వంద ఫీట్ల రోడ్డుతో పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన ఇళ్లు, దుకాణాలు కోల్పోతారని అన్నారు. ప్రభుత్వం రోడ్డు విస్తరణ విషయంలో స్పష్టతనిచ్చి ప్రజల్లో ఆందోళన తొలగించాలని కోరారు. దాసరి లింగస్వామి, మడత నారాయణ, ఎస్‌కె.ఇమాం పాల్గొన్నారు.

### తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్డీవో

గూడూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) :తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆర్డీవో కృష్ణవేణి గురువారం సందర్శించారు. అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం గూడూరులో నిర్వహించే సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. ఎన్యుమరేటర్ ద్వారాసర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో వీరస్వామి, ఎంపీవో సత్యనారాయణ, కార్యదర్శి భీమా ఉన్నారు.

## సర్కారీ స్కూళ్లపై నిర్లక్ష్య ధోరణిని వీడాలి

● జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్

గూడూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల నిర్వహణలో సర్కారు నిర్లక్ష్య ధోరణిని వీడాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ అన్నారు. గూడూరులోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం బాలల దినోత్సవం సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళ్లర్పించారు. అనంతరం పాఠశాల అభివృద్ధి, విద్యాబోధనపై ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గూడూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు గొప్ప చరిత్ర ఉందన్నారు. ఇక్కడ విద్యనభ్యసించిన వేలాది మంది విద్యార్థులు ప్రస్తుతం ఉన్నతస్థాయిలో ఉన్నారని చెప్పారు. నేడు పాఠశాల చతకిల పడడం బాధకరమన్నారు. పాఠశాలలో మూత్రశాలలు, కంప్యూటర్, లైబ్రెరి, క్రీడా సామగ్రి లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తనవంతుగా పాఠశాలకు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గూడూరు ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ, ఖాళీ సమయంలో గొర్రెలు కాస్తూతానే జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిస్థాయికి ఎదిగానని చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో వీరస్వామి, ఎంపీవో సత్యనారాయణ, ఏటీడీవో భాస్కర్, హెచ్ఎం సదాశివ, మాజీ ఎంపీపీ చెల్పూరి వెంకన్న, మోదీన్, ఎలమందల శ్రీనివాస్, పుట్ట ఐలయ్య, అనిల్ పాల్గొన్నారు.

**గిరిజనుల సమస్య పరిష్కారానికి కృషి**

మహబూబాబాద్ రూరల్ : గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని జాటోతు హుస్సేన్‌నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వద్దిరాజు రాంచందర్‌రావు, క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ, ఆకుల శ్రీనివాస్, చెల్పూరి వెంకన్న, పల్లె సందీప్, వెన్నమల్ల సందీప్ పాల్గొన్నారు.

### గ్రంథాలయాలు విజ్ఞాన గనులు

● అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో

మహబూబాబాద్ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలు విజ్ఞాన గనులని, వాటిని సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. తొలుత గ్రంథాలయ శాస్త్ర పితమహులు డాక్టర్ ఎస్ఆర్. రంగనాధన్, తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా మేధస్సు పెంపొందుతుందని చెప్పారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో పింగిలి శ్రీనివాసరావు, రాంనర్సయ్య, గూడ నరేందర్, విజయేందర్, వీరేందర్,భూలక్ష్మి, శ్రీనివాస్, నరేష్, హిమబిందు, నారాయణ పాల్గొన్నారు.

## పాఠశాలల్లో స్వయం పరిపాలన దినోత్సవం



విద్యాభారతి హైస్కూల్‌లో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పిస్తున్న కరస్పాండెంట్ తక్కెళ్లపల్లి విజితాప్రభాకర్‌రావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ జయంతిని పురస్కరించుకుని గురువారం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ బాల్యస్మృతులు మరుపురానివని, బాలలందరు వాటిని మదుర జ్ఞాపకాలుగా మిగుల్చుకోవాలని సూచించారు. వివిధ పాఠశాలల్లో విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణలు వేయడంతో పాటు చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థులు డీఈవో, ఎంఈవో, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

● మహర్షి విద్యాలయలో వేడుకల్లో విద్యార్థినీ, విద్యార్థులు చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ మల్లిరెడ్డి సుధాఅర్జున్‌రెడ్డి, డైరెక్టర్లు డాక్టర్ సూర్యకుమారి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

● జమాండ్లపల్లి విద్యాభారతిలో కరస్పాండెంట్ తక్కెళ్లపల్లి విజితాప్రభాకర్, కల్లెం వీరారెడ్డి, టి.సదానందం, గోవర్దన్ పాల్గొన్నారు

● ఏకశిలా ఏంజిల్స్ హైస్కూల్‌లో నిర్వహించి వేడుకల్లో ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి, ఇన్చార్జీలు మయూరి, ఐస్లిన్, మినీ, ఉపాధ్యాయ బృందం పాల్గొంది.

● సీరోలు మండలం మన్నెగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకలో జడ్పీ డిప్యూటీ సీఈవో నర్మద, ఎంఈవో లక్ష్మా, హెచ్ఎం సుధాకర్, మాజీ ఎంపీటీసీ కొండపల్లి విజయ్‌పాల్ రెడ్డి పాల్గొన్నారు.

● జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో హెచ్ఎంపొడుగు నర్సయ్య, హెచ్‌డబ్ల్యూవో అనిత, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



మహబూబాబాద్ మహర్షి విద్యాలయలో బాలల దినోత్సవ వేడుకలో నృత్యం చేస్తున్న చిన్నారులు

**క్రైం కార్నర్‌న్యూస్**

### విధులకు ఆటంకం కల్గించిన వ్యక్తిపై కేసు నమోదు

బయ్యారం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులపై దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి గురువారం అరెస్టు చేసినట్లు బయ్యారం ఎస్సై తిరుపతి పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని వెంకట్రాంపురం క్రాస్ రోడ్ వద్ద ఈ నెల 13న బుధవారం సాయంత్రం ఎస్సై సిబ్బంది ఖజా, వెంకటేశ్వర్లు, భద్రులతో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ చెకింగ్‌లో భాగంగా వాహనాలు తనిఖీ చేస్తున్నారు ఈ క్రమంలోనే పందిపెడె గ్రామానికి చెందిన లావుడ్య శేఖర్ తనని డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తారా.. అంటూ పోలీసులపై దురుసుగా ప్రవర్తిస్తూ విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో శేఖర్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్సై వెల్లడించారు. ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఎస్సై ఈ సందర్భంగా హెచ్చరించారు.

### పురుగుల మందుతాగి సెక్యూరిటీ గార్డు ఆత్మహత్య

● కేసు నమోదు చేసిన పోలీసులు

నెహ్రూసెంటర్ నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహించి పురుగల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, బంధువుల కథనం ప్రకారం. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలకేంద్రానికి చెందిన కుక్కముడి సురేష్ (27) మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో శిశుసంజీవని కేంద్రంలో సెక్యూర్టిగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. ఏమైందో ఏమోకాని సరేష్ బుధవారం అకస్మాత్తుగా పురుగుల మందుతాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు చికిత్సకోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. రాత్రి చికిత్స పొంది తెల్లవారు జామున మెరుగైన చికిత్స కోసం ధరణి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందారు. మృతుడికి భార్య, ఓ కుమారుడు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### విద్యార్థులే ఉపాధ్యాయులుగా..



స్వయం పరిపాలన దినోత్సవ విద్యార్థులతో ఉపాధ్యాయులు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ పట్టణంలోని వండర్‌కిడ్జ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈవోగా జి.మణిప్రీత్, ఎంఈవోగా ఎస్.వియాన్‌సాయి, కరస్పాండెంట్‌గా కె.వర్షిణి, ప్రిన్సిపాల్‌గా బి.మహదేవి వ్యవహరించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ బి.రమాదేవి, ప్రిన్సిపాల్ లలిత మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల నిర్వహణతో విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయవచ్చని చెప్పారు. అనంతరం స్వయం పరిపాలన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు.

● మహబూబాబాద్ మండలం ముడుపుగల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్) లో స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. డీఈవోగా కె.మానస, ఎంఈవోగా బి.చందన, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంగా ఎం.సింధు, హెచ్ఎంగా వి.గౌతమ్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఇద్దయ్య, ఉపాధ్యాయులు వి.విద్యాసాగర్, బి. రమాదేవి, డి. పూర్ణచందర్, ఆర్. కృష్ణయ్య పాల్గొన్నారు.

### లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

కొత్తగూడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం గంగారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో గుండె జబ్బుల నివారణపై వైద్య శిబిరం నిర్వహించారు. ధరణి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు పాల్గొన్న వైద్య శిబిరంలో వివిధ గ్రామాలకు చెందిన 208 మందికి ఈసీజీ, 2డీ ఏకో వైద్య పరిక్షలు నిర్వహించారు. మందులు పంపిణీచేశారు. గుండె జబ్బులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. డీఎం అండ్ హెచ్‌వో మురళిధర్, డీప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో ప్రమీల రావు, వైద్యులు ప్రత్యూష, సారంగం, నాగేశ్వరరావు, సాగర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు యాల్ల మురళీరెడ్డి, కార్యదర్శి అశోక్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి, పీవీ ప్రసాద్, పీహెచ్‌సీ వైద్యసిబ్బంది, ఆశ వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### 'సహకార సంఘాలను బలోపేతం చేయాలి'

గార్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రైతుల అభివృద్ధిలో కీలక భూమికి పోషిస్తున్న సహకార సంఘాలను బలోపేతం చేయడంలో రైతులు కృషి చేయాలని పీఏసీఎస్ చైర్మన్ వడ్లముడి దుర్గాప్రసాద్ అన్నారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా స్థానిక కార్యాలయంలో సహకార జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతుల ఆర్థికాభివృద్ధి కోసం పాటు పడుతున్న సహకార సంఘాలను బలోపేతం చేయాలన్నారు. రైతులు తీసుకున్న పంట రుణాలు సకాలంలో వడ్డీలు చెల్లించి రెన్యువల్ చేసుకోవాలన్నారు. వైస్ చైర్మన్ గంగావత్ లక్ష్మణ్‌నాయక్, డైరెక్టర్లు యార్లగడ్డ వెంకటేశ్వర్‌రావు, పసుపులేటి వెంకటేశ్వర్లు, ఎలమకంటి కమలమ్మ, సీఈవో వెంకటేశ్వర్లు, రైతులు సంజీవరెడ్డి పాల్గొన్నారు.

### సమగ్ర కుటుంబ సర్వే పరిశీలన

బయ్యారం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను బయ్యారం మండలం కొత్తపేట గ్రామంలో గురువారం జిల్లా పరిషత్ సీఈవో పురుషోత్తం పరిశీలించారు. బయ్యారం మండల పరిషత్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆయన కొత్త పేట గ్రామంలో చేపడుతున్న సర్వేను పరిశీలించారు. నిర్ణీత కాలంలో సర్వే పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో విజయలక్ష్మిని ఆదేశించారు. అంతకు ముందు మండల పరిషత్ కార్యాలయంలో సర్వే కొరకు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో నర్మదతో పాటు ఎంపీవో చంద్రమోహన్, సూపరిండెంట్ దైవాదినం తదితరులు పాల్గొన్నారు.

### మత్స్యకారులకు అండగా ప్రజాప్రభుత్వం

**మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి**

తొర్రూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతి రెడ్డి అన్నారు. గురువారం తొర్రూరు పెద్ద చెరువు వద్ద మత్స్యకారులు, మత్స్యశాఖ అధికారులతో కలిసి ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఉచిత చేప పిల్లలను పంపిణీ చేశారు. మత్స్యకారులు చైర్మన్ తిరుపతి రెడ్డిని మత్స్యకారులు శాలువా మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి అలువాల సోమయ్య, కొత్తూరి రమేష్, సొసైటీ అధ్యక్షుడు శంకబోయిన యాకన్న, రాము, చంద్రమూర్తి, జిల్లా అధికారి బి.వీరన్న, రవి, మత్స్యకారులు ఉన్నారు.

### విద్యార్థుల భవిష్యత్తుకు సీఎం కృషి

**ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్**

మరిపెడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. గురువారం ఆయన మరిపెడ మోడల్ స్కూళ్లో సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లను ప్రారంభించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నేత యుగేంధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాంలాల్, వార్డు కౌన్సిలర్ విసారపు శ్రీపాల్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్లు బట్టునాయక్, ఐలిమల్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తాజ్‌ద్దీన్ నాయకులు అఫ్జల్, అప్సర్, అల్వాల ఉపేందర్, సురేందర్‌రెడ్డి, రవికాంత్, ప్రిన్సిపాల్ సత్తార్, మాజీ చైర్మన్ విష్ణు, మాజీ సర్పంచ్ కృష్ణ పాల్గొన్నారు.

### పశుపోషణతో అర్థికాభివృద్ధి సాధ్యం

**ఇన్‌చార్జ్ పశువైద్యాధికారి రాజశేఖర్**

పెద్దవంగర, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి) : పశుపోషణతో అర్థికాభివృద్ధి సాధ్యమని మండల ఇన్‌చార్జ్ పశువైద్యధికారి బి.రాజశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని ఉప్పరగూడెంలో పశు సంవర్ధకశాఖ ఉమ్మడి వరంగల్ పశు గణాభివృద్ధి ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు సీజన్‌లో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనంతరం పాడి రైతులకు మినరల్ మిక్చర్, కాల్షియం మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ అనిల్, ఎల్ఎస్ఏ రాము, వీఎల్‌వో ప్రభాకర్, గోపాల మిత్ర వైద్యులు వెంకన్న, యాకుబ్, మురళికృష్ణ తదితరులు పాల్గొన్నారు.